క్లుప్తంగా

వ్యక్తి అదృశ్యం



అదృశ్యమైన లింగన్న

కర్నూలు: నగరంలోని అశోక్‌నగర్‌లో నివాసముంటున్న చాకలి లింగన్న (40) అదృశ్యమయ్యాడు. కోడుమూరు పట్టణానికి చెందిన ఈయన కొన్నేళ్ల క్రితం ఉపాధి నిమిత్తం కర్నూలుకు వచ్చారు. లింగన్న ఆర్‌టీఏ ఏజెంట్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. గత నెల 25వ తేదీ సాయంత్రం ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలే దు. కుటుంబ సభ్యులు లింగన్న కోసం బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద ఆరా తీశారు. కర్నూలు నగరంతో పాటు చుట్టుముట్టు గ్రామాల్లో గాలించినా ఆచూకీ లభించలేదు. దాదాపు 12 రోజుల నుంచి కనిపించకపోవడంతో కుమారుడు శివకుమార్ రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆచూకీ తెలిసినవారు 94418 92833 లేదా 701392 2766 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం తెలియజేయాలని కుటుంబ సభ్యులు కోరారు.

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి అమానుషం

కర్నూలు(అర్బన్): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై సోమవారం ఒక న్యాయవాది దాడి చేయడం అమానుషమని జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పి. హరినాథ్‌చౌదరి, ఎం. వెంకటేశ్వర్లు, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు పి.రవిగువేరా, సీనియర్ న్యాయవాది వై. జయరాజు అన్నారు. న్యాయవాదులు ప్రతి విషయంలోనూ సహనం కోల్పోయి ప్రవర్తించకూడదన్నారు. ఇలాంటి తెలివి లేని అజ్ఞానుల చర్యను తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు. స్వయం ప్రతిపత్తి కలిగిన న్యాయ వ్యవస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సుప్రీంకోర్టుపై దాడి అంటే దేశ గౌరవంపై దాడి అని ఐఏఎల్ (ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్) నేతలు అభిప్రాయపడ్డారు. న్యాయస్థానం స్వతంత్రగా ఉంటేనే ప్రజాస్వామ్యం నిలుస్తుందని, జడ్జి గౌరవం కూలిపోతే దేశ ప్రతిష్ట కూలిపోతుందన్నారు. ఈ సంఘటన ప్రతి భారతీయుడికి అవమానమన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉపాధి అవకాశాలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న గుడిపల్లె సురేంద్ర

కర్నూలు (టౌన్): క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, స్పోర్ట్స్ కోటాలో క్రీడాకారులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ సభ్యులు, మాజీ కార్పొరేటర్ గుడిపల్లె సురేంద్ర అన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో జిల్లా స్థాయి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14 బాలికల రగ్బీ పోటీలు నిర్వహించారు. పోటీలను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో విద్యార్థినీ, విద్యార్థులకు మానసిక ప్రశాంతతో పాటు శారీరక శ్రమ అవసరమన్నారు. ప్రతి రోజు కొంత సమయాన్ని క్రీడలకు కేటాయించాలన్నారు. ప్రతిభ చాటడం ద్వారా తమ భవిష్యత్తును ఉజ్వలంగా తీర్చిదిద్దుకోవచ్చన్నారు.

కర్రల సమరానికి ఎవరి అనుమతి ఉంది?



స్పందనలో ఫిర్యాదు చేస్తున్న మూలింటి చంద్రశేఖర్

కర్నూలు(సెంట్రల్): దేవరగట్టు మాల మల్లేశ్వర స్వామి ఉత్సవాల్లో కర్రల సమరానికి ఆలయ కమిటీ ఏమైనా అనుమతి పొందిందా? లేదా జిల్లా కలెక్టర్, ఎస్పీ అనుమతులు ఇచ్చారా అని ప్రశ్నిస్తూ ఆస్పరికి చెందిన మూలింటి చంద్రశేఖర్ అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన అధికారులను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బన్ని ఉత్సవాల్లో ప్రతి సంవత్సరం మరణాలు సంభవించడం, వందల మంది గాయపడుతున్నా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం, ఆలయ కమిటీ విఫలమైందన్నారు. దీనిపై జాతీయ మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయిస్తున్నట్లు పేర్కొన్నారు.

సెల్ టవర్ ఎక్కిన యువకుడు

పాణ్యం: మద్దూరు గ్రామానికి చెందిన వడ్డె రామాంజినేయులు అనే యువకుడు సెల్‌టవర్ ఎక్కి సోమవారం ఆత్మహత్యకు ప్రయత్నించాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వడ్డె రామాంజినేయులతో మాట్లాడారు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు.. వడ్డె రామాంజినేయులుకు భార్య ఉంది.. అయితే మరో మహిళతో సహజీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య ఘర్షణ తలెత్తడంతో మహిళను కొట్టగా ఆమె పోలీసులను ఆశ్రయించి అతనిపై కేసు నమోదు చేయించింది. కాగా, తనకు ఆ మహిళ కావాలంటూ సోమవారం సెల్‌టవర్ ఎక్కి బెదిరింపులకు దిగాడు. ఫోన్‌లో వడ్డె రామాంజినేయులతో మాట్లాడి సర్దిచెప్పి సెల్ టవర్ దింపినట్లు పోలీసులు చెప్పారు. తర్వాత సీఐ ద్వారా కౌన్సెలింగ్ ఇచ్చినట్లు తెలిపారు. ఇందిలా ఉండగా వడ్డె రామాంజినేయులపై ఇప్పటికే అనేక కేసులు ఉన్నట్లు వెల్లడించారు.

గుంతలు వెక్కిరిస్తున్నాయి!

గుంతలమయంగా నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని నందికొట్కూరు రోడ్డు





బిర్లాగేట్ సర్కిల్ వద్ద పైపై మరమ్మతులు చేయడంతో మళ్లీ యథాస్థితికి చేరిన రోడ్డు



వాల్‌మార్ట్ సమీపంలో పూర్తిగా దెబ్బతిన్న రోడ్డు

అధికారంలోకి వస్తే రోడ్లను అద్దంలా మారుస్తాం. ఎక్కడా ఓ చిన్న గుంత కూడా కనిపించదు. ఇలా ఎన్నికల ముందు కూటమి పార్టీల నాయకులు ప్రగల్భాలు పలికారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర అవుతుంది రోడ్ల అభివృద్ధి దేవుడెరుగు ఉన్న రోడ్లకు కనీస మరమ్మతులు కూడా చేయడం లేదు. ఎక్కడైనా చేసినా కాసులకు కక్కుర్తి పడి నాణ్యతకు తిలోదకాలు ఇస్తుండటంతో పది రోజుల్లో మళ్లీ యథాస్థితికి చేరుకుంటున్నాయి. పై చిత్రాల్లో గుంతలు పడి, కంకరతేలి ప్రమాదకరంగా కనిపిస్తున్న ఈ రోడ్లు ఎక్కడివో కాదు జిల్లా కేంద్రం కర్నూలు నగరంలోనివే. పైపైన మరమ్మతులు చేసి చేతులు దులుపుకోవడంతో గుంతలు తేలి అధికారులను వెక్కిరిస్తున్నాయి. ఈ రహదారుల్లో ప్రయాణం వాహనదారులకు నరకప్రాయంగా మారింది. ఏ మాత్రం ఆదమరిచినా ప్రమాదం బారిన పడాల్సిందే.

– కల్లూరు

పీఎం పర్యటనలో బాధ్యతగా వ్యవహరించాలి

- లైజనింగ్, సెక్టార్ లైజనింగ్ అధికారులతో ఎస్పీ సమీక్ష



ప్రధానమంత్రి పర్యటనపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ

కర్నూలు: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈనెల 16వ తేదీన కర్నూలు పర్యటన నేపథ్యంలో జిల్లా పోలీసు అధికారులు భద్రత పరంగా పకడ్బందీ ఏర్పాట్లు, బందోబస్తు సిద్ధం చేసుకోవాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో సోమవారం రాత్రి లైజనింగ్ అధికారులు, సెక్టార్ ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు. ప్రధాని పర్యటన నిమిత్తం వీవీఐపీలు, డీజీపీ, ఐజీ, డీఐజీ స్థాయి వంటి ఐపీఎస్ అధికారులు జిల్లాకు వస్తుంటారని, లైజనింగ్ ఆఫీసర్లు, సెక్టార్ ఇన్‌చార్జ్ లైజనింగ్ అధికారులు విధుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. రూట్లు, పార్కింగ్ ప్రదేశాలు, వసతి సౌకర్యాలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎయిర్‌పోర్టు, రోడ్డు డైవర్షన్స్, చెక్ పాయింట్లు, ట్రాఫిక్ నియంత్రణపై తీసుకోవలసిన చర్యలపై చర్చించి పలు సూచనలు చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. అక్టోబర్ 13వ తేదీ బందోబస్తు విధులకు వచ్చిన ఫోర్స్ రిపోర్టు చేసుకుంటారని, 14వ తేదీన ట్రయల్ రన్ నిర్వహించాల్సి ఉంటుందన్నారు. నన్నూరు టోల్‌ప్లాజా దగ్గర ఉన్న రాగమయూరిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పీఎం ప్రసంగిస్తారన్నారు. అడిషనల్ ఎస్పీలు హుసేన్ పీరా, కృష్ణమోహన్, డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

వైభవంగా మహర్షి వాల్మీకి విగ్రహ ప్రతిష్ట



వాల్మీకి విగ్రహ ప్రతిష్ట సందర్భంగా పూజ చేస్తున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: మండల పరిధిలోని ఉలిందకొండ గ్రామంలో మహర్షి వాల్మీకి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం సోమవారం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మహర్షి వాల్మీకి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వాల్మీకి సేవ సంఘం నాయకులు, భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

రోగులకు ఉత్తమ వైద్యసేవలందించాలి

- వైద్యులతో డీఎంఈ డాక్టర్ రఘునందన్



వైద్యపరికరాల గురించి తెలుసుకుంటున్న డీఎంఈ డాక్టర్ రఘునందన్

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు వచ్చే రోగులకు ఉత్తమ వైద్యసేవలు అందించడంలో వైద్యులు ముందుండాలని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) డాక్టర్ రఘునందన్ చెప్పారు. ఆసుపత్రి నిర్వహణ, సిబ్బంది సమయపాలన, పరిశుభ్రత, రోగుల పట్ల సేవాభావం వంటి అంశాలపై సోమవారం ఆయన కర్నూలు మెడికల్ కాలేజీలో వైద్యులతో సమీక్షించారు. ప్రభుత్వ వైద్యులు పనిచేస్తున్నా సాంకేతికంగా దానిని ప్రదర్శించుకోవడం లేదన్నారు. ముఖ్యంగా ప్రతి కేసుకు ఆయుష్మాన్ భారత్ ఐడీ నమోదు పూర్తి స్థాయిలో చేయడం లేదని, దీనివల్ల చేసిన పని కూడా సాంకేతికంగా చూపించలేకపోతున్నామని అసంతృప్తి వ్యక్తం చేశారు. వైద్యులు సమయపాలన పాటించాలని, నిర్దేశిత సమయం వరకు తప్పకుండా విధుల్లో ఉండాలన్నారు. సర్జరీ విభాగపు వైద్యులు మాట్లాడుతూ పని విషయంలో ఇప్పటికే లక్ష్యాల కంటే ఎక్కువగా సాధించామని, ల్యాప్రోస్కోపిక్ పరికరాల అవశ్యకత ఉందని కోరారు. కేఎంసీ ప్రిన్సిపల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ మాట్లాడుతూ ఇక్కడే వైద్యబోధకుడిగా పనిచేసి రాష్ట్ర స్థాయి డీఎంఈగా డాక్టర్ రఘునందన్ చేరుకోవడం గర్వకారణమన్నారు. అనంతరం డాక్టర్ రఘునందన్‌ను అధికారులు, వైద్యులు ఘనంగా సన్మానించారు.

వివిధ విభాగల తనిఖీ

అంతకుముందు స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో రోగులకు అందుతున్న వైద్యసేవలను పరిశీలించారు. రోగులకు నాణ్యమైన, సమయపాలనతో కూడిన సేవలు అందించడంలో ఎలాంటి రాజీ పడకూడదన్నారు. వైద్యులు బాధ్యతతో, సేవాభావంతో పనిచేయాలని సూచించారు. ఆధునిక సాంకేతిక పద్ధతులు మరింత విస్తృతంగా ఉపయోగించి సేవల నాణ్యత పెంచాలని సూచించారు. అనంతరం స్కూల్ ఆఫ్ నర్సింగ్ భవనాన్ని పరిశీలించి నూతన భవన నిర్మాణానికి సంబంధించిన మాస్టర్ ప్లాన్‌ను పరిశీలించి ఇంజనీర్లతో చర్చించారు. భవన నిర్మాణ పనుల పూర్తి వివరాలను సమర్పించాలని, పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆ తర్వాత కాలేజ్ ఆఫ్ నర్సింగ్ హాస్టల్ వసతులను స్వయంగా పరిశీలించారు. విద్యార్థులకు మెరుగైన వసతులు, సౌకర్యాలు కల్పించేందుకు అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని ఆదేశించారు. ఆయన వెంట ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ సీఎస్‌కే ప్రకాష్, కేఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రేణుకాదేవి, డాక్టర్ సాయిసుధీర్, డాక్టర్ సింధియా శుభప్రద, డాక్టర్ హరిచరణ్, ఆసుపత్రి ఇన్‌చార్జ్ సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ పాల్గొన్నారు.

ఫ్లోరోసిస్‌తో పిల్లల్లో మరుగుజ్జుతనం



పిల్లలకు నిర్వహిస్తున్న దంత పరీక్షలను పరిశీలిస్తున్న డాక్టర్ సుధాకర్

కర్నూలు(హాస్పిటల్): దీర్ఘకాలిక ఫ్లోరైడ్‌తో బాధపడుతున్న గర్భిణిల్లో పుట్టబోయే శిశువులకు దంతాలు ప్రారంభదశలో ఎగుడు దిగుడుగా ఉంటాయని, పిల్లలు మరుగుజ్జుతనానికి లోనవుతారని ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ సుధాకర్ చెప్పారు. సోమవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని జిల్లా సత్వర చికిత్స కేంద్రంలో ఉన్న ఓపీ నెంబర్ 43లో ఫ్లోరోసిస్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని ప్రాంతాల నుంచి వచ్చే దంత వైద్యులు, దంత సహాయకులు, మహిళలకు ఫ్లోరోసిస్ వ్యాధి గురించి వివరించారు. 18 ఏళ్లలోపు పిల్లల్లో వచ్చే పుట్టుక లోపాలు, గర్భధారణ సమయంలో ఫ్లోరైడ్ అధికంగా ఉన్న నీటిని వంటలలో ఉపయోగించడం వల్ల, ఆ నీటిని తాగిన గర్భిణులకు ప్రేగు గోడలు దెబ్బతిని శరీరం ఐరన్‌ను శోషించుకోదన్నారు. ఫ్లోరైడ్ అధికంగా ఉన్న నీటిని తాగడం వల్ల గర్భిణికి రక్తహీనత రావచ్చన్నారు. ఫ్లోరోసిస్ ఉన్న ప్రాంతాల్లో గర్భిణిలు కాల్షియం, ఐరన్, విటమిన్-సి, జింక్ కలిగిన ఆహార పదార్థాలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చిన్నపిల్లల వైద్యులు సృజన, దంత వైద్యులు లక్ష్మీరెడ్డి, డైస్ మేనేజర్ ఇర్ఫాన్, దంత సహాయకుడు ప్రమోద్‌కుమార్ పాల్గొన్నారు.

చిన్న వ్యాపారుల షాపులు తొలగిస్తే మోదీ పర్యటన అడ్డుకుంటాం



నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు,చిరు వ్యాపారులు

కర్నూలు (టౌన్): నగరంలో సుందరీకరణ పేరుతో చిన్న వ్యాపారుల షాపులు తొలగిస్తే ప్రధాని మోదీ పర్యటనను అడ్డుకుంటామని సీఐటీయూ నగర కార్యదర్శి మహమ్మద్ షరీఫ్, ఉపాధ్యక్షులు రాముడు, రాజశేఖర్ స్పష్టం చేశారు. సోమవారం స్థానిక నగరపాలక సంస్థ ఎదుట ఆ సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలో వేలాది మంది పేదలు తోపుడు బండ్లు, చిన్న బంకులు, నడక దారి వద్ద చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. అలాంటి వారి దుకాణాలను మున్సిపల్ అధికారులు బలవంతంగా తొలగించడం కడుపు కొట్టడం కాదా.. అని ప్రశ్నించారు. స్మార్ట్ సిటీ పేరుతో రెడ్ జోన్, గ్రీన్ జోన్, ఎల్లో జోన్ అంటూ చిరు వ్యాపారులను చిన్నాభిన్నం చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా బంకుల తొలగింపును ఆపాలన్నారు. ధర్నా సమయంలో కమిషనర్ ప్రభుత్వ అతిథి గృహంలో ఉన్నట్లు సమాచారం తెలియడంతో సీఐటీయూ నాయకులు, వ్యాపారులు అక్కడికి వెళ్లి ఆందోళన చేపట్టారు. నగరపాలక కమిషనర్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. చివరకు కమిషనర్ స్పందించి కమిషనర్ బంకుల తొలగింపును నిలిపి వేస్తామని హామీ ఇచ్చారు.

అభివృద్ధి పనులకు ప్రాధాన్యత



దేవనగర్‌లో సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న 25 వ వార్డు కార్పొరేటర్ సిట్రా సత్యనారాయణమ్మ

కర్నూలు (టౌన్): నగరంలోని 25 వ వార్డులో అభివృద్ధి పనులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ మాజీ జిల్లా అధ్యక్షురాలు, 25 వ వార్డు కార్పొరేటర్ సిట్రా సత్యనారాయణమ్మ అన్నారు. సోమవారం దేవనగర్ ప్రధాన రహదారిలో రూ.80 లక్షలు సాధారణ నిధులు వెచ్చించి ఏర్పాటు చేస్తున్న సీసీ రోడ్డు పనులకు ఆమె భూమిపూజ చేసి ప్రారంభించారు. ఏడాదిన్నర క్రితమే ఈ సీసీ రోడ్డుకు అనుమతి వచ్చిందన్నారు. అయితే అప్పట్లో ఎన్నికల కోడ్ కారణంగా పనులు వాయిదా వేశారన్నారు. ఎంతో కాలంగా ఇక్కడ రోడ్డు ఇబ్బందిగా ఉండేదన్నారు. రద్దీగా ఉండే ఈ రహదారిలో ప్రజల కొరిక మేరకు సీసీ రోడ్డు నిర్మిస్తున్నట్లు చెప్పారు. స్థానిక కాలనీ వాసులు పాల్గొన్నారు.

నేటి నుంచి కార్తీక దీపోత్సవం

కర్నూలు కల్చరల్: ఇస్కాన్ ఆధ్వర్యంలో స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని పూరి జగన్నాథ ఆలయంలో మంగళవారం నుంచి అక్టోబర్ 21వ తేదీ వరకు కార్తీక దీపోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఇస్కాన్ జిల్లా బాధ్యులు రఘునందన సేవక్ ప్రభు పేర్కొన్నారు. ప్రతి రోజు సాయంత్రం 7 గంటలకు ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్ర మాలు జరుగుతాయని తెలిపారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

కలసి పనిచేస్తేనే స్వచ్ఛాంధ్ర సాధ్యం



అవార్డులు పొందిన వారితో మంత్రి, అధికారులు

కర్నూలు కల్చరల్: స్వచ్ఛత అంటే శుభ్రత మాత్రమే కాదని, ఆరోగ్యకర సమాజానికి పునాది అని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖా మంత్రివర్యులు టీజీ భరత్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర అవార్డుల ప్రదానం జిల్లా స్థాయి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ మధ్యనే జపాన్ దేశం పర్యటనకు వెళ్లడం జరిగిందని, అక్కడ చెత్త నుంచి ఆదాయం వచ్చే విధంగా పనులు జరుగుతున్నాయన్నారు. కర్నూ లు నగరంలో వర్షానికి కాలువలు నిండిపోయి ఇబ్బందులకు గురవడానికి ముఖ్య కారణం మన ఇంట్లోని చెత్తను కాలువలో వేయడమన్నారు. దీన్ని మనం అరికట్టి కర్నూలు నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుకునే విధంగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. జాయింట్ కలెక్టర్ నవ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయకుండా, ఉమ్మి వేయకుండా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో జిల్లాపరిషత్ సీఈఓ నాసరరెడ్డి, ఐసీడీఎస్ పీడీ విజయ, అదనపు మున్సిపల్ కమిషనర్ కృష్ణ, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ విశ్వేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధం కండి

- వాల్మీకులకు వీఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మద్దూరు సుభాష్ చంద్రబోస్ పిలుపు



మాట్లాడుతున్న సుభాష్ చంద్రబోస్

కర్నూలు(అర్బన్): వాల్మీకులు ఎస్టీ రిజర్వేషన్ సాధన కోసం ప్రభుత్వంపై పోరాడేందుకు సిద్ధ కావాలని వాల్మీకి రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు మద్దూరు సుభాష్ చంద్రబోస్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబుపై ఆధారపడిన కేంద్ర ప్రభుత్వం ఈ సమయంలో ఆయన ఏమి చెప్పినా చేస్తుందన్నారు. ప్రతి ఎన్నికల్లో రాష్ట్రంలో ఉన్న వాల్మీకులను ఎస్టీలుగా గుర్తిస్తామని టీడీపీ అధినేత హామీలు ఇవ్వడం తర్వాత విస్మరించడం జరుగుతుందన్నారు. ఇప్పుడు అవకాశం ఉండి కూడా ఎస్టీలుగా గుర్తించకుండా మోసం చేస్తే వాల్మీకుల తిరుగుబాటు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ నెల 7వ తేదీన (నేడు) మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను కుల, మతాలకు అతీతంగా గ్రామ గ్రామాన ప్రజలంతా పండుగ వాతావరణంలో జరుపుకోవాలని ఆయన కోరారు.

స్టేషనరీ లేకుండా పనులు ఎలా చేయాలి?



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న మున్సిపల్ సుపీరియర్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు

కర్నూలు (టౌన్): కార్యాలయంలో కంప్యూటర్లు, ప్రింటర్లు పనిచేయడం లేదు. కనీసం స్టేషనరీ లేదు. ఇలా ఉంటే పనులు ఎలా చేయాలి? ప్రజల ముందు, ప్రజా ప్రతినిధుల ముందు మీరు వ్యవహరిస్తున్న తీరుతో తలదించుకునే పరిస్థితులు ఉన్నాయని మున్సిపల్ సుపీరియర్ ఉద్యోగుల సంఘం నాయకులు, మున్సిపల్ ఉద్యోగులు, సచివాలయాల ఉద్యోగులు కమిషనర్ ఎదుట వాపోయారు. ఒక్క రోజులో అద్భుతాలు జరగవు అని చెప్పిన మీరు చేయాల్సిన పనిని పక్కన పెట్టి మెమోలు , సర్క్యులర్ పేరుతో ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. సోమవారం నగరపాలక నూతన కౌన్సిల్ హాలులో నగరపాలక కమిషనర్ పి. విశ్వనాథ్‌ను మున్సిపల్ ఉద్యోగులు నేరుగా కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ 25 సంవత్సరాలుగా కర్నూలు కార్పొరేషన్‌లో అన్ని విభాగాల ఉద్యోగులు రాజకీయపార్టీలతో సంబంధం లేకుండా అప్పగించిన ప్రతి పనిని సక్రమంగా చేస్తూ వస్తున్నట్లు చెప్పారు. ఇప్పుడు పని ఒత్తిడి పెంచడంతో పాటు తమను బద్ధ శత్రువుగా చూస్తున్నారన్నారు. ఇప్పటికే పగలు, రాత్రి అన్న తేడా లేకుండా విధులు నిర్వహిస్తున్నామని, కార్పొరేషన్ కుటుంబ పెద్దగా తమకు సహకరించాలన్నారు. సమావేశంలో మున్సిపల్ ఉద్యోగుల సంఘం నాయకులు రామకృష్ణ, శ్రీకాంత్, మేనేజర్ చిన్న రాముడు, రెవెన్యూ అధికారులు జునీద్, వాజిద్, ఇతర విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

నూతన జీఎస్టీతో ధరల తగ్గుదల



ఎక్స్‌పోలో స్టేషనరీని పరిశీలిస్తున్న జేసీ డాక్టర్ నవ్య, జాయింట్ కమిషనర్ జె.నీరజ

కర్నూలు(హాస్పిటల్):కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జీఎస్టీ స్లాబ్‌లతో పలు రకాల వస్తువుల ధరలు తగ్గాయని జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ నవ్య, వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ జె.నీరజ చెప్పారు. వాణిజ్య పన్నుల శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌ఏపీ క్యాంపులోని కల్యాణమండపంలో ఏర్పాటు చేసిన జీఎస్టీ ఎక్స్‌పోలో వివిధ స్టాళ్లను ఏర్పాటు చేశారు. జీఎస్టీ తగ్గింపు ధరలు, అంతకు ముందు ధరలు పట్టిక ద్వారా వినియోగదారులకు లభించే ప్రయోజనాలను తెలియజేశారు. నిత్యావసర వస్తువులు, స్టేషనరీ, ఔషధాలతో పాటు టూ వీలర్, కార్లు, ట్రాక్టర్లను ఎక్స్‌పోలో ప్రదర్శించారు. తగ్గిన ధరలపై అవగాహన కల్పించేలా బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జేసీ, జాయింట్ కమిషనర్ మాట్లాడుతూ తగ్గిన జీఎస్టీ ద్వారా పేద, మధ్యతరగతి వినియోగదారుల కొనుగోలు శక్తి పెరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా డీఎస్ఓ రాజా రఘువీర్, డిప్యూటీ కమిషనర్ మురళీమనోహర్, ఏపీఎస్‌పీ డీఎస్పీ మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీపై అవగాహన కార్యక్రమాలు

సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ ప్రచార కార్యక్రమంలో భాగంగా సోమవారం కర్నూలు నగరంలోని జిల్లా క్రీడా మైదానం, జిమ్ సెంటర్, యోగా కేంద్రం, బిర్లాకాంపౌండ్‌లోని సెలూన్‌లు, మౌర్య ఇన్ హోటల్ ప్రాంగణంలలో వినియోగదారులకు నూతన జీఎస్టీ స్లాబులపై కరపత్రాలు పంపిణీ చేసి అధికారులు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ ఆరోగ్య,వ్యక్తిగత బీమాలపై జీఎస్టీ ఉండదని, యోగా, జిమ్ సెంటర్‌లలో చెల్లించే రుసుములపై, క్రీడా సామగ్రిపై జీఎస్టీని 18 నుంచి 5 శాతానికి తగ్గించారని, ఈ మేరకు వినియోగదారులకు డబ్బు ఆదా అవుతుందన్నారు. కార్యక్రమంలో సెట్కూరు సీఈఓ డాక్టర్ వేణుగోపాల్, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి భూపతి, డీసీహెచ్ఎస్ డాక్టర్ జఫ్రుల్లా, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ సతీష్‌కుమార్‌రెడ్డి, జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ రామకృష్ణ, గాయత్రి పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు అందని వేతనాలు

- 1వ తేదీ వేతనాలందించడంలో కూటమి ప్రభుత్వం విఫలం
- ఎంపీఈవోలకు ఏప్రిల్ నుంచి అందని వేతనాలు

కర్నూలు(అగ్రికల్చర్): వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు సెప్టెంబరు నెల వేతనాలు ఇప్పటి వరకు పొందని పరిస్థితి ఏర్పడింది. ప్రతి నెల 1వ తేదీనే ఉద్యోగులకు వేతనాలు చెల్లిస్తున్నామని చెబుతున్న కూటమి ప్రభుత్వం గత నెల వేతనాలను విజయదశమి పండగ నాటికి కూడా చెల్లించలేదు. దసరా మరుసటి రోజున ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులకు వేతనాలు వారి బ్యాంకు ఖాతాలకు జమ అయ్యాయి. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు వారం రోజులవుతున్నా జమ కాలేదు. దీంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఉద్యోగుల కుటుంబాల్లో పండగ కళ కనిపించలేదు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు అతి తక్కువగా ఉన్నాయి. అంతంతమాత్రం వేతనంతో నెల రోజులు గడపడం కష్టతరమే. రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా వీరికి కూడా వేతనాలు చెల్లిస్తే కాస్త ఊరట లభిస్తుంది. 6వ తేదీ నాటికి కూడా వేతనాలు ఊసే లేకపోవడం పట్ల దాదాపు అన్ని ప్రభుత్వ శాఖల్లోని అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. కూటమి ప్రభుత్వం దృష్టిలో తాము ఉద్యోగులం కాదేమోనంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కింది స్థాయిలో అవుట్ సోర్సింగ్‌పై పనిచేసే ఉద్యోగులపై చిన్నచూపు తగదని పేర్కొంటున్నారు. ఇప్పటికైన ప్రభుత్వం చొరవ తీసుకొని రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా వేతనాలు చెల్లించాలని కోరుతున్నారు. మరోవైపు వ్యవసాయ శాఖ కాంట్రాక్ట్ పద్ధతిపై పనిచేస్తున్న ఎంపీఈవోలకు ఈ ఏడాది ఏప్రిల్ నుంచి వేతనాలు లేవు. వారం 10 రోజులు ఆలస్యమైతే ఉద్యోగుల కుటుంబాలకు ఆర్థిక ఇబ్బందులు చుట్టుముడుతాయి. ఎంపీఈవోలకు మాత్రం ఆరు నెలలుగా వేతనాలు లేవంటే వారి జీవనం ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు. ఇప్పటికైన ప్రభుత్వం చొరవ తీసుకొని నెలనెలా వేతనాలు చెల్లించాలని ఎంపీఈఓలు కోరుతున్నారు.